# ఆంధ్రదేశంలో జాతీయోద్యమం

భారత స్వాతంత్ర్యం కోసం జరిగిన జాతీయోద్యమ ప్రభావం ఆంధ్ర దేశంపై ఎంతో ఉంది. భరతమాత స్వేచ్ఛావాయువులు పీల్చేందుకు తెలుగువాళ్లు అనేకమంది ప్రాణాలొడ్డి పోరాడారు. రాజకీయ సంస్కరణల కోసం కృషి చేసిన తొలి ఆంధ్రుడు, దక్షిణ భారతీయుడు గాజుల లక్ష్మీ నరసుశెట్టి. ఈయన మద్రాసు స్థానికుల సభ లేదా చెన్నపట్టణ స్వదేశీ సంఘాన్ని 1852, జనవరి 26న స్థాపించారు. ఈయన 'క్రిసెంట్' పత్రిక ద్వారా కూడా ప్రజల్లో జాతీయతాభావాన్ని వ్యాప్తికి కృషి చేశారు.

1884, మే 16న మద్రాసులో 'మద్రాస్ మహాజన సభ' ఏర్పడింది. ఈ సభకు అధ్యక్షుడైన పి.రంగయ్యనాయుడు, కార్యదర్శి పి.ఆనందాచార్యులు ఇద్దరూ మంచి మిత్రులు. భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించక ముందే ఈ పై రెండు సభలూ ప్రజా సమస్యల్ని బ్రిటిష్ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు విశేష కృషి సలిపాయి. ఈ విధంగా ప్రారంభమైన ఆంధ్రలోని జాతీయోద్యమం 1885-1947 మధ్యకాలంలో కింద పేర్కొన్న దశలుగా సాగిందని చెప్పుకోవచ్చు.

జాతీయ కాంగ్రెస్ ప్రభావ దశ (1885-1905)
వందేమాతర ఉద్యమ దశ (1905-1911)
హోంరూల్ ఉద్యమ దశ (1916-1920)
సహాయ నిరాకరణోద్యమ దశ (1920-25)
శాసనోల్లంఘనోద్యమ దశ (1930-40)
క్విట్ ఇండియా ఉద్యమ దశ (1942-45)

**జాతీయ కాంగ్రెస్ ప్రభావ దశ (1985-1905) :**

1885, డిసెంబర్ 28న బొంబాయిలో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపితమైంది. ఈ చారిత్రక సభకు ఆంధ్రులైన పి.రంగయ్యనాయుడు, పి.ఆనందాచార్యులు, న్యాపతి సుబ్బారావు (రాజమండ్రి), వెంకట సుబ్బారాయుడు (మచిలీపట్నం), గుత్తి కేశవ పిళ్లై (అనంతపురం) తదితరులు హాజరయ్యారు. 1891లో నాగపూర్ కాంగ్రెస్ మహాసభకు ఆనందచార్యులు అధ్యక్షత వహించారు. ఈయన కాంగ్రెస్ అధ్యక్షుడైన తొలి తెలుగు వాడే కాదు తొలి దాక్షిణాత్యుడు కూడా!

భారత జాతీయ కాంగ్రెస్‌కు జిల్లాల్లో కూడా కాంగ్రెస్ సంఘాలు ఏర్పరచడం ఆంధ్ర ప్రాంతం నుంచే మొదలైంది. 1892లో కృష్ణా జిల్లా కాంగ్రెస్ సంఘం ఏర్పడింది. మద్రాస్ ప్రెసిడెన్సీలోనే కాకుండా మొత్తం దేశంలోనే తొలి జిల్లా కాంగ్రెస్ సంఘమిది. ఈ సంఘం తొలి సమావేశం గుంటూరులో రామస్వామి గుప్తా ఆధ్వర్యంలో జరిగింది. 1893లో మచిలీపట్నంలో రెండో సమావేశం, 1894లో ఏలూరులో మూడో సమావేశం జరిగాయి.

**వందేమాతర ఉద్యమ దశ (1905-1911) :**

1905, జూలై 7న అప్పటి వైస్రాయ్ లార్డ్ కర్జన్ బెంగాల్ రాష్ట్రాన్ని విభజించడంతో వందేమాతరం ఉద్యమం ఊపిరిపోసుకుంది. ఈ ఉద్యమ ప్రభావం ఆంధ్ర ప్రాంతంపై కూడా పడింది. వందేమాతరం ఉద్యమానికి మద్దతుగా ఆంధ్రలో తొలిసారిగా మద్రాస్ బీచ్ సమావేశం జరిగింది. 1905, సెప్టెంబర్‌లో జరిగిన ఈ సమావేశానికి స్వదేశీమిత్రన్ సంపాదకుడు జి.సుబ్రహ్మణ్య అయ్యర్ అధ్యక్షత వహించారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు, కొమర్రాజు లక్ష్మణరావు, గొల్లపూడి సీతారాం తదితరులు ఈ సభను నిర్వహించారు.

వందేమారతం లేదా స్వదేశీ ఉద్యమం నాటికి కాంగ్రెస్‌లో అతివాద, మితవాద భేదాలు తలెత్తాయి. 1906 కలకత్తా కాంగ్రెస్ సమావేశానికి హాజరైన కొమర్రాజు లక్ష్మణరావు, మునగాల రాజా, గాడిచర్ల హరిసర్వోత్తమరావు తదితర ఆంధ్రులు అతివాదపక్షాన్ని బలపరిచారు. ఇదే సమావేశంలో స్వదేశీ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆంధ్రుడైన పి.ఆనందాచార్యులకు దక్కుతుంది. వందేమాతర ఉద్యమ స్ఫూర్తితో 1907 ఫిబ్రవరి 11న రాజమండ్రిలో బాలభారతి సమితి ఏర్పడింది. దీనిని టంగుటూరు శ్రీరాములు, గంటి లక్ష్మన్న, కంచుమర్తి రామచంద్రరావు స్థాపించారు.

వందేమాతర ఉద్యమ ప్రచారం కోసం 1907 ఏప్రిల్‌లో బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలో పర్యటించారు. ఈ పర్యటనను నిర్వహించిన వారు 'కృష్ణా పత్రిక' సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు. ఈ పర్యటన వరసగా విశాఖ, విజయనగరం, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, మచిలీపట్నంలలో సాగింది. రాజమండ్రిలో యాదేళ్ల సారయ్య ఇంటిలో బిపిన్‌చంద్ర పాల్ బస చేశారు. రాజమండ్రిలో పాల్ పర్యటనలో ట్రైనింగ్ కాలేజి విద్యార్థి గాడిచర్ల హరిసర్వోత్తమ రావు కీలకపాత్ర పోషించారు. పాల్ ప్రసంగాన్ని అనువదిస్తూ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు 'భరతఖండంబు చక్కని పాడియావు...' అంటూ ఆశువుగా చెప్పిన తేటగీతి పద్యం నేటికీ జాతీయోద్యమ స్ఫూహకు నిలువుటద్దం.

పాల్ రాజమండ్రిలో ఆంధ్ర జాతీయ విద్యా సంఘం ప్రారంభించారు. పాల్ పర్యటనతో రాజమండ్రి ప్రాంతమంతటికీ వందేమాతర ఉద్యమం స్ఫూర్తి ఆవరించింది. ఇక్కడ బిపిన్ చంద్రపాల్ 'గోదావరీ స్వదేశీ స్టోర్'ను కూడా ప్రారంభించారు. ప్రిన్సిపల్ మార్క్ హంటర్ ఆదేశాల్ని లెక్కచేయకుండా కళాశాల విద్యార్థులు వందేమాతరం బ్యాడ్జీలు ధరించారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావును ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆంధ్ర ప్రాంతం నుంచి జైలుకెళ్లిన తొలి స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల. రాజమండ్రి కళాశాల సంఘటన ఆంధ్రదేశంలో విద్యార్థులు రాజకీయాల్లో పాల్గొనడానికి నాంది పలికింది.

ఆంధ్ర పర్యటనలో భాగంగా విజయవాడ విచ్చేసిన బిపిన్ చంద్రపాల్ అక్కడ మునగాల రాజా ఆతిథ్యం స్వీకరించారు. మచిలీపట్నంలో పాల్ బ్రహ్మసమాజ సభ్యుడైన రామదాసు నాయుడు ఇంట్లో

SAKSHI

బస చేశారు. అక్కడ పాల్ ఉపన్యాసాలతో ప్రభావితుడైన కోపల్లె హనుమంతురావు తన ప్లీడర్ పట్టా చింపేశాడు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా ఆంధ్రదేశంలో కాకినాడ దొమ్మీ కేసు, కోటప్ప కొండ సంఘటన, తెనాలి బాంబు సంఘటన వంటివి జరిగాయి.

1907లో కాకినాడలో దొమ్మీకేసు జరిగింది. అప్పటి జిల్లా వైద్యాధికారి కెప్టెన్ కెంప్ రోడ్డు మీద వెళుతుండగా కొందరు యువకులు వందేమాతర నినాదాలు చేశారు. దీనికి ఆగ్రహించిన కెప్టెన్ కెంప్, కృష్ణారావు అనే విద్యార్థిపై చేయి చేసుకున్నాడు. దీంతో కాకినాడ ప్రజలు కోపోద్రిక్తులై కెంప్ బస చేసిన యూరోపియన్ క్లబ్‌పై దాడి చేశారు. ఈ దొమ్మీ కేసులో అరెస్టయిన వారి తరపున న్యాపతి సుబ్బారావు (రాజమండ్రిలో లాయర్) వాదించారు. ఆంధ్ర దేశంలో రాజకీయాలకు సంబంధించిన మొదటి క్రిమినల్ కేసు ఇదే.

స్వరాజ్య పత్రికలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఓ వ్యాసం రాశారు. దీంతో గాడిచర్లను, ఆ పత్రిక ప్రచురణ కర్త బోడి నారాయణరావును 1908, జూలై 18న బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ కేసును విచారించిన కృష్ణా జిల్లా సెషన్స్ జడ్జి కెర్స్‌హాన్స్ 1908, నవంబర్ 9న ఈ ఇద్దరికీ జైలుశిక్ష విధించారు. ఈ విధంగా వందేమాతరం ఉద్యమ సమయంలో ఆంధ్ర ప్రాంతం నుంచి జైలుకి వెళ్లిన తొలి స్వాతంత్ర్య సమరయోధుడుగా గాడిచర్ల ఘనత సాధించారు.

1909, ఫిబ్రవరి 18న కోటప్పకొండ సంఘటన జరిగింది. గుంటూరు జిల్లా కోటప్పకొండపై శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఓ గొడవలో చిన్నపరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఆవేశానికి గురైన ప్రజలు వందేమాతర నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌ని తగలబెట్టారు. చివరకు చిన్నపరెడ్డిని ప్రభుత్వం ఉరి తీసింది.

వందేమాతర ఉద్యమకాలంలోనే గుంటూరు జిల్లా తెనాలి దగ్గర కంచర్లపాలెంలో బాంబు పేలి ఓ వ్యక్తి మరణించాడు. ఈ బాంబును తయారు చేశారన్న అభియోగంతో 1909, ఏప్రిల్ 6న ప్రభుత్వం చుక్కపల్లి రామయ్య, బసవయ్య, వెంకట్రాయుడులను అరెస్టు చేసింది. వీరిలో బసవయ్య తరపున న్యాయవాదిగా టంగుటూరి ప్రకాశం వాదించారు.

వందేమాతర ఉద్యమ కాలంలో విశిష్ట రచనలు వెలువడ్డాయి. చెన్నాప్రగడ భానుమూర్తి 'భారత దర్శనం', అత్తిలి సూర్యనారాయణ 'హిందూదేశ దారిద్ర్యం', ముట్నూరి సుబ్బారాయుడు, మంగిపూడి వెంకట శర్మ 'మాతృ శతకం', చెరకువాడ వెంకట రామయ్య, గాడి జగన్నాథస్వామి 'లాలా లజపతిరాయ్' వంటివి వచ్చాయి.

**హోంరూల్ ఉద్యమం (1916–1920) – ఆంధ్రపై ప్రభావం :**

బ్రిటిష్ సార్వభౌమాధికారానికి లోబడుతూనే స్వయంపాలనను సాధన లక్ష్యంతో ప్రారంభమైనదే హోంరూల్ ఉద్యమం. 1916లో బాలగంగాధర్ తిలక్, అదే సంవత్సరం సెప్టెంబర్‌లో అనీబిసెంట్ హోంరూల్ లీగ్‌లను స్థాపించారు. ఆంధ్ర దేశంలో హోంరూల్ లీగ్ ఉద్యమానికి అనీబిసెంట్ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ ఉద్యమ ప్రచారంలో భాగంగా అనీబిసెంట్ 1916లో రాజమండ్రి, కాకినాడ, చిత్తూరుల్లో పర్యటించారు. మదనపల్లిలో ఆమె జాతీయ కళాశాలను ప్రారంభించారు.

హోంరూల్ లీగ్ ఆంధ్ర శాఖకు కార్యదర్శిగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు పని చేశారు. ఈ ఉద్యమ భావాల్ని ప్రజల్లో వ్యాపింపజేసేందుకు ఈయన 'స్వరాజ్యం కోరుటకు కారణం', 'స్వరాజ్య పరమోద్దేశం', 'స్వాతంత్ర్య వర్ధనపత్రం' వంటి కరపత్రాలను ఆయుధాలుగా మలచుకున్నారు. ఇవి మూడు పైసల కరపత్రాలుగా ప్రసిద్ధికెక్కాయి. సరోజినీనాయుడు రాసిన 'ఎవేక్ మదర్' గీతాన్ని 'నూతన హైందవ మాతృదేశం' పేరుతో తెలుగులోకి గాడిచర్ల అనువాదం చేశారు. ఆంధ్రప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చేందుకు 'స్వరాజ్య గ్రంథమాల' ఎంతో కృషి చేసింది. దీనిపక్షాన దామరాజు పుండరీకాక్షయ్య రాసిన 'స్వరాజ్య సోపానం', 'పాంచాలీ పరాభవం', 'స్వరాజ్య రథం' వంటి రచనలు వెలువడ్డాయి. అలాగే.. చెరకువాడ నరసింహం 'స్వరాజ్య దర్పణం', మాడభూషి నరసింహాచారి 'అసహాయోద్యమ విజయం' వంటి రచనల్ని కూడా ఈ గ్రంథమాల అందించింది.

**సహాయ నిరాకరణోద్యమ దశ (1921–22) :**

గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమ ప్రభావం కూడా ఆంధ్రదేశంపై ఉంది. 1991లో గాంధీజీ ఆంధ్రదేశంలో పర్యటించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్, విజయవాడలను ఆయన సందర్శించారు. విజయవాడలో గాంధీజీ ఉపన్యాసాన్ని అయ్యదేవర కాళేశ్వరరావు అనువదించారు. ఇక మద్రాస్‌లో గాంధీజీ సభకు టంగుటూరి ప్రకాశం అధ్యక్షత వహించారు. ఈ సభలోనే సరోజినీనాయుడు రౌలత్ బిల్లుకు తీర్మానం ప్రతిపాదించారు.

1919 ఏప్రిల్ 13న అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో జరిగిన దురాగతాన్ని నిరసిస్తూ గాడిచర్ల హరిసర్వోత్తమరావు 'నేషనలిస్ట్' పత్రికలో 'తుపాకీ సంస్కృతి' పేరుతో వ్యాసం రాశారు. ఈ కాల్పుల్లో నిరాశ్రయులైన వారికి ఆర్థికసాయం చేసేందుకు కొండా వెంకటప్పయ్య విరాళాలు సేకరించారు. సహాయ నిరాకరణోద్యమ ప్రచారంలో భాగంగా గాంధీజీ 1920, ఆగస్టు 1న విజయవాడ వచ్చారు. ఈ సందర్భంగా గులాం మొహియుద్దీన్ తన గౌరవ మేజిస్ట్రేట్ పదవిని వదులుకున్నారు. అలాగే.. అయ్యదేవర కాళేశ్వరరావు తాను ఎన్నికల్లో పోటీ చేయనంటూ తన దరఖాస్తును ఉపసంహరించుకున్నారు.

1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీల్లో కాంగ్రెస్ సమావేశం విజయవాడలో జరిగింది. అప్పుడు మాగంటి అన్నపూర్ణాదేవి ఖద్దరు చీర ధరించి విదేశీ చీరల్ని తగుల బెట్టారు. అంతేకాకుండా ఈమె తిలక్ స్వరాజ్య నిధికి తన నగలన్నీ సమర్పించారు. పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని జాతీయ కాంగ్రెస్ జెండాగా గాంధీజీ ఈ సమావేశంలోనే ఆమోదించారు. ఈ సమావేశం జరిగిన ప్రదేశమే నేటి విజయవాడలోని గాంధీనగర్.

బెజవాడ సభ అనంతరం గాంధీజీ కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు, నెల్లూరు, బాపట్ల, చీరాల, వేటపాలెం

SAKSHI

లలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా- యామినీ పూర్ణ తిలక అనే నటీమణి దేవదాసి వృత్తిని వదలి తన నగలన్నింటినీ సహాయ నిరాకరణోద్యమానికి సమర్పించాలి. 'మాకొద్దీ తెల్ల దొరతనం...' గీతం రాసినందుకు గరిమెళ్ల సత్యనారాయణకు ప్రభుత్వం ఆరు నెలల జైలు శిక్ష విధించింది. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ఆంధ్రదేశంలో పలు చైతన్యవంతమైన ఉద్యమాలు జరిగాయి.

**చీరాల - పేరాల ఉద్యమం (1921-22) :**

సహాయ నిరాకరణోద్యమ కాలంలో పన్నులు కట్టడాన్ని నిరాకరించడమే కాకుండా ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న ఉద్యమం ఇది. 1991కి పూర్వం వీర రాఘవపేట, జాండ్రపేట, చీరాల -పేరాల అనే గ్రామాలు చీరాల యూనియన్‌గా ఉండేవి. 1919లో చీరాల-పేరాలకు మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల ప్రజలపై పన్నుభారం మునుపటి కన్నా 10 రెట్లు పెరిగింది. దీంతో అక్కడి ప్రజలు 'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో పన్నులు కట్టబోమని మొండికేశారు. దుగ్గిరాల విన్నపంపై గాంధీజీ 1921, ఏప్రిల్ 6న చీరాల సందర్శించారు. గాంధీజీ స్ఫూర్తినివ్వడంతో ప్రజలు 1921, ఏప్రిల్ 25న రాత్రివేళ తమతమ ఇళ్లను వదలిపెట్టి ఊరవతల నివాసం ఏర్పరచుకున్నారు. వారంతా 'రామదండు'గా ఏర్పడి 'రామ్‌నగర్' నిర్మించుకున్నారు. అక్కడ ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పంచాయతీ అధ్యక్షుడిగా దుగ్గిరాల ఎన్నికయ్యారు. దాదాపు పదకొండు నెలలపాటు ఇలాగే సాగింది.

అయితే ప్రభుత్వం దుగ్గిరాలను అరెస్టు చేయడం, చౌరీచౌరా ఘటనతో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపి వేయడం వంటి కారణాల వల్ల చీరాల-పేరాల ఉద్యమం కూడా ఆగిపోయింది. రామ్‌నగర్‌ను 'పారిస్ కమ్యూన్'తో పోల్చవచ్చు. 1938లో బెజవాడ గోపాలరెడ్డి నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ మంత్రివర్గం ఈ మున్సిపాలిటీని రద్దు చేసింది. ఈ చీరాల-పేరాల ఉద్యమాన్ని వివరిస్తూ పిసుపాటి నారాయణశాస్త్రి 1922లో 'చీరాల-పేరాల వనవాసం' గ్రంథాన్ని రాశారు.

**పలనాడు పుల్లరి సత్యాగ్రహం :**

సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా జరిగిన మరో ప్రభావవంతమైన ఉద్యమం ఇది. ఆనాటి పలనాడు తాలూకాలోని మాచర్ల, వెల్దుర్తి, జట్టిపాళెం, శ్రీగిరిపాటు, రెంటచింతల గ్రామాల్లోని ప్రజలు అడవులపై ఆధారపడేవారు. 1921లో కరువు ఏర్పడింది. దీంతో అటవీ వినియోగానికి చెల్లించే పుల్లరిపై రాయితీ ఇవ్వాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. అయితే, ప్రభుత్వ ఈ విషయంలో సానుకూలంగా స్పందించలేదు. దీంతో పుల్లరి చెల్లించేది లేదని ప్రజలు సహాయ నిరాకరణ చేశారు.

1921, సెప్టెంబర్ 23న పోలీసుల అండతో ప్రభుత్వాధికార్లు 300 పశువుల్ని నిర్బంధించారు. దీంతో మంచాలపాడు గ్రామానికి చెందిన కన్నెగంటి హనుమంతు నాయకత్వంలో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. పోలీసుల కాల్పుల్లో కన్నెగంటి కన్నుమూయడంతో ప్రభుత్వానిదే పైచేయి అయింది. కడప జిల్లా రాయచోటిలో కూడా ఈ మాదిరి పుల్లరి ఉద్యమం జరిగింది.

**పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం :**

1922, జనవరి 7న విజయవాడలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పన్నుల నిరాకరణోద్యమాన్ని గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి కార్యరూపమే పెదనందిపాడు ఉద్యమం. గుంటూరు జిల్లాలో 'ఆంధ్ర శివాజీ' పర్వతనేని వీరయ్యచౌదరి నాయకత్వంలో ఇది జరిగింది. ఈయన నేతృత్వంలో నాలుగు వేల మంది వాలంటీర్లతో స్వచ్ఛంద 'శాంతిసేన' ఏర్పాటైంది. పెదనందిపాడు ఫిర్కాకు చెందిన వంద గ్రామాల గ్రామాధికారులు తమ పదవులకు రాజీనామా చేశారు.

ఈ ఉద్యమాన్ని అణచి వేసేందుకు ప్రభుత్వం మద్రాస్ నుంచి థామస్ రూథర్‌ఫర్డ్‌ను పంపించింది. మరోవైపు ఈ ఉద్యమం కొనసాగింపుపై ఆంధ్ర కాంగ్రెస్ నాయకుల్లో కూడా విభేదాలు తలెత్తాయి. దీంతో కాంగ్రెస్ కమిటీ కాశీనాథుని నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం, దండు నారాయణరాజులతో ఓ ఉపసంఘాన్ని నియమించింది. ఉద్యమాన్ని విరమించాలని ఈ సంఘం నివేదించింది. అలాగే ఈ ఉద్యమాన్ని ఆపి వేయాల్సిందిగా కొండా వెంకటప్పయ్యకు గాంధీజీ సొంత దస్తూరీతో ఓ లేఖ రాశారు. పర్వతనేనిని కాల్చి చంపుతామని బెదిరించి, తర్వాత క్షమాపణ పత్రం రాయించుకుని ప్రభుత్వం వదలిపెట్టింది. దీంతో ఈ ఉద్యమం 1922, ఏప్రిల్ నాటికి ఆగిపోయింది. 'భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్య పునాదుల్ని కదిలించిన ఉద్యమం'గా దీన్ని మద్రాస్ గవర్నర్ లార్డ్ వెల్లింగ్టన్ పేర్కొన్నారు.

**రంప విప్లవం (1922, జనవరి - 1924 మే) :**

అల్లూరి సీతారామరాజు పేరు తెలియని ఆంధ్రుడు కనిపించడు. సాంకేతికంగా చూస్తే అల్లూరి తీసుకొచ్చిన మన్యం విప్లవంతో కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. అయితే జాతీయ స్వాతంత్ర సమర ప్రభావం దీనిపై లేకపోలేదు. అయినా శాంతియుత సత్యాగ్రహానికి పరిమితం కాకుండా విప్లవబాటలో నడచిన ఉద్యమం ఇది. 1897లో పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లు గ్రామంలో పుట్టిన అల్లూరి 1921, జూలైలో జాతీయోద్యమ ప్రభావంతో చిట్టగాంగ్ వెళ్లాడు. అక్కడి బెంగాల్ విప్లవకారుల ప్రభావానికి లోనయ్యాడు.

ముత్తదారీ వ్యవస్థ, అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం దౌర్జన్యం, స్థానిక తహసీల్దార్ బాస్టియన్ అకృత్యాలు మొదలైన వాటితో తీరని కష్టాలకు గురైన మన్యం ప్రజల్ని అల్లూరి సంఘటిత పరచి ఉద్యమం లేవనెత్తాడు. తాండవ నదీ తీరాన కృష్ణదేవి పేటకు సమీపంలో 'శ్రీ రామ విజయనగరం' అనే ఆశ్రమాన్ని నెలకొల్పాడు. ఈ తిరుగుబాటులో గాం మల్లుదొర, గాం గంటం దొర, ఎండుపడాలు అనే గిరిజనులు, అగ్గిరాజుగా పిలిచే పేరిచర్ల సూర్యనారాయణ రాజులు అల్లూ

SAKSHI

రికి సహాయంగా నిలిచారు.

అల్లూరి సీతారామరాజు మొట్టమొదటిగా 1922, ఆగస్టు 22న చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశాడు. ఆపై కృష్ణదేవిపేట, రామవొమ్మంగి స్టేషన్లపై దాడి చేసి ఆయుధాల్ని అపహరించాడు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం స్కాట్ కవార్డ్, హేటస్‌ల నేతృత్వంలో ప్రత్యేక సాయుధ దళాల్ని రంప ప్రాంతానికి తరలించింది.

1922, సెప్టెంబర్ 3న పంజేరీ ఘాట్ వద్ద ప్రభుత్వ దళాలకు రంప విప్లవకారులకు తొలిసారి ప్రత్యక్ష సాయుధ పోరాటం జరిగింది. పోలీసు దళాలకు ట్రైమెస్ హేర్ నాయకత్వం వహించారు. అయితే, చివరకు ప్రభుత్వ దళాలే పలాయనం చిత్తగించక తప్పలేదు. 1922, సెప్టెంబర్ 23న సీతారామరాజు దామన్ ఘాట్ వద్ద ప్రభుత్వ దళాలపై మెరుపుదాడి జరిపాడు. ఈ పోరాటంలో స్కాట్ కవార్డ్, హేటస్‌లను అల్లూరి హతమార్చాడు.

ఈ ఉద్యమ తీవ్రతను గ్రహించిన ప్రభుత్వం మలబారు నుంచి ప్రత్యేక పోలీసు దళాల్ని రప్పించింది. అయినప్పటికీ రంప విప్లవకారుల గెరిల్లా పోరాటాల ముందు ప్రత్యేక దళాలు కూడా నిలవలేని పరిస్థితి ఏర్పడింది. 1922, అక్టోబర్ 16న రాజు అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై దాడి చేశాడు. 1922, డిసెంబర్ 6న పెదగడ్డపాలెం వద్ద మలబారు పోలీసులపై విప్లవకారులు మెరుపుదాడి చేశారు. అయితే ఈ దాడితో పోలీసులదే పైచేయి అయింది. ఇది అల్లూరి చవిచూసిన తొలి ఓటమి. ఈ ప్రభావంతో కొంతకాలంపాటు అల్లూరి దాడులకు స్వస్తి చెప్పాడు.

ఇక రంప విప్లవం ముగిసిందని భావించిన ప్రభుత్వం మలబారు పోలీసుల్ని వెనక్కి పిలిపించింది. ఈ అదను కోసమే ఎదురుచూస్తోన్న రాజు తిరిగి దాడులు ప్రారంభించాడు. ఈ క్రమంలో.. 1923, ఏప్రిల్ 18న అన్నవరం పోలీస్‌స్టేషన్‌పై తొలి దాడి చేశాడు. 1923, సెప్టెంబర్ 23న నడింపల్లి గ్రామం వద్ద మల్లుదొర పోలీసులకు చిక్కాడు. అంతలో ప్రభుత్వం 1924లో రూథర్‌ఫర్డ్‌ను ఏజెన్సీకి ప్రత్యేక కమిషనర్‌గా నియమించింది. 1924, మే 6న పేరిచర్ల సూర్యనారాయణ రాజుని మద్దేరు వద్ద పోలీసులు పట్టుకున్నారు.

1924, మే 7న ఓ కుంట దగ్గర సంధ్యావందనం చేసుకుంటున్న రాజుని జమేదార్ కంచుమీనన్ అకస్మాత్తుగా దాడి చేసి నిర్బంధించాడు. అక్కడి నుంచి తీసుకెళ్లి చింతలపూడి ఘాట్‌లోని మేజర్ గుడాల్ ముందు అల్లూరిని ప్రవేశపెట్టారు. మేజర్ గుడాల్– అల్లూరి సీతారామరాజుని కనీసం విచారణ కూడా లేకుండా కాల్చి చంపాడు. 1924, మే 8న కృష్ణదేవిపేట దగ్గర రాజుని సమాధి చేశారు. గాంధీజీ 'యంగ్ ఇండియా' పత్రికలో 'నేను సాయుధ విప్లవాన్ని ఆమోదించను. కానీ, అల్లూరి సాహసి' అంటూ కొనియాడటం విశేషం.

1924, మే 26న ఎండుపడాలును నమ్మకద్రోహులైన ఇద్దరు గ్రామీణులు హతమార్చారు. 1924, జూన్ 7న పోలీసులు గాం గంటం దొరను చంపారు. దీంతో మన్య విప్లవం అంతరించింది.

**స్వరాజ్య పార్టీ ఏర్పాటు :**

చౌరీచౌరా ఘటనతో గాంధీజీ 1922, ఫిబ్రవరిలో సహాయ నిరాకరణ ఉద్యమం నిలిపి వేయడం కొందరు నాయకులకు నచ్చలేదు. మోతీలాల్, హకీం అజ్మల్‌ఖాన్, విఠల్‌భాయ్, చిత్తరంజన్‌దాస్‌లు 1923లో స్వరాజ్యపార్టీ స్థాపించారు. ఆంధ్రదేశంలో స్వరాజ్యపార్టీ శాఖ అధ్యక్షుడు అయ్యదేవర కాళేశ్వరరావు. ఇంకా ఈ పార్టీలో సభ్యులుగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పిల్లలమర్రి ఆంజనేయులు, వేమవరపు రామదాసు, బి.వెంకటరత్నం వంటి వారెందరో పని చేశారు. 1924లో గంజాంలో జరిగిన సభల్లో బులుసు సాంబమూర్తి సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ప్రతిపాదించారు. స్వరాజ్య పార్టీ ప్రచార నిమిత్తం చిత్తరంజన్‌దాస్ ఆంధ్రలో పర్యటించారు.

మరోవైపు– 1923 నాటి నాగపూర్ జెండా సత్యాగ్రహంలో నాళం చిన భీమరాజు, ఏడిద సత్యనారాయణ, బులుసు యజ్ఞన్న, జిల్లేపల్లి కామేశ్వరరావు తదితర ఆంధ్రులు పాల్గొన్నారు. అలాగే.. ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ లీగ్ కార్యకలాపాలు కూడా ఆంధ్రలో చురుగ్గా సాగాయి. సుభాష్ చంద్రబోస్, బులుసు సాంబమూర్తిల సహాయంతో జవహర్‌లాల్ నెహ్రూ 1928లో ఆలిండియా ఇండిపెండెన్స్ లీగ్‌ను స్థాపించారు. దీనికి అనుబంధంగా ఆంధ్ర ప్రావిన్షియల్ ఇండిపెండెన్స్ లీగ్ 1928, డిసెంబర్ 19న ఏర్పడింది. దీనికి అధ్యక్షుడు బులుసు సాంబమూర్తి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి తెన్నేటి విశ్వనాథం. ఈ లీగ్ విషయంలో ఆంధ్రలో చురుగ్గా పని చేసినవారు 'కాంగ్రెస్' వారపత్రిక సంపాదకులు మద్దూరి అన్నపూర్ణయ్య. సైమన్ కమిషన్ బహిష్కరణలో కూడా లీగ్ ముందగుడు వేసింది.

1919 నాటి మాంటేగ్ ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణల్ని సమీక్షించడానికి సర్ జాన్ సైమన్ అధ్యక్షతన 1927, నవంబర్ 8న ఏర్పడినదే సైమన్ కమిషన్. దీంట్లో ఒక్క భారతీయుడు కూడా లేనందువల్ల అన్ని రాజకీయ పార్టీలూ దీనిని బహిష్కరించాయి. ఈ కమిషన్ పర్యటనకై ఆంధ్రదేశంలో గుంటూరు, ఒంగోలు పట్టణాల్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. 1928 ఫిబ్రవరి 26న ఈ కమిషన్ మద్రాస్‌ను సందర్శించింది. మద్రాస్‌లో సైమన్ కమిషన్ బహిష్కరణోద్యమానికి టంగుటూరి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా జరిగిన పోలీసు కాల్పుల్లో పార్థసారథి అనే వ్యక్తి మరణించాడు. 'ధైర్యముంటే తనను కాల్చండం టూ...' టంగుటూరి ప్రకాశం పంతులు చొక్కా గుండీలు తీసి గుండెల్ని చూపి పోలీసుల ఎదుట నిలిచాడు. ఆ సాహసాన్ని చూసి పోలీసులు వెనుకడుగు వేశారు. టంగుటూరి 'ఆంధ్ర కేసరి' అయ్యాడు.

**ఉప్పు సత్యాగ్రహం :**

1930, మార్చి 6న గాంధీజీ సబర్మతి ఆశ్రమం నుంచి 79 మందితో బయలుదేరి గుజరాత్ తీరంలో ఉన్న 'దండి' అనే గ్రామం దగ్గర 1930, ఏప్రిల్ 6న ఉప్పు తయారు చేయడంతో శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభమైంది. ఈ దండియాత్రలో పాల్గొన్న ఆంధ్రుడు ఎర్నేని సుబ్రహ్మణ్యం. ఉప్పు సత్యాగ్రహంగా పేరొందిన ఈ శాసనోల్లంఘన ఉద్యమం ఆంధ్రదేశంలో అపూర్వంగా సాగింది. ఈ ఉద్యమ నిర్వహణకు ఆంధ్రదేశంలో సర్వాధికారిగా కొండా వెంకటప్పయ్య నియమి

SAKSHI

తులయ్యారు.

**ఆంధ్రలోని సత్యాగ్రహ శిబిరాలు :**

రాయలసీమ – బళ్లారి
విశాఖపట్నం ప్రాంతం – విజయనగరం
నెల్లూరు జిల్లా – పల్లిపాడు ఆశ్రమం
గుంటూరు ప్రాంతం – గుంటూరు
తూర్పు కృష్ణా – మచిలీపట్నం
పశ్చిమ కృష్ణా – విజయవాడ
తూర్పు గోదావరి జిల్లా – సీతానగరం

ఆంధ్రదేశంలో మాదిరిగానే మద్రాస్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు ఇల్లు 'వేదవనం' సత్యాగ్రహ శిబిరంగా నిలిచింది.

ఆంధ్రప్రాంతంలో ఉప్పు సత్యాగ్రహం మొదట కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ప్రారంభమైంది. 1930, ఏప్రిల్ 9న అయ్యదేవర కాళేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, పట్టాభి సీతారామయ్యలు మచిలీపట్నం తీరానికి చేరి ఉప్పు తయరు చేశారు. మద్రాస్‌లో జరిగిన ఉద్యమానికి కూడా టంగుటూరి ప్రకాశం, కాశీనాథుని నాగేశ్వరరావు వంటి ఆంధ్ర నాయకులే సారథ్యం వహించారు. 1930, మే 15న ఆచంట రుక్మిణీ లక్ష్మీపతిని ప్రభుత్వం అరెస్టు చేసింది. భారత్ మొత్తం మీద ఉప్పు సత్యాగ్రహ సమయంలో అరెస్టయిన తొలి మహిళ రుక్మిణీ లక్ష్మీపతి. ఉప్పు సత్యాగ్రహ ప్రభావంతో త్రిపురనేని రామస్వామి చౌదరి 'వీర గంథము తెచ్చినారము వీరు డెవ్వడో తెల్పుడి...' గేయం రాయగా, గరికపాటి మల్లావధాని 'ఉప్పు పాట' రాశారు.

ఇదే సమయంలో వివిధ ప్రభావాలతో ఆంధ్ర ప్రాంతంలో వివిధ పార్టీలు, సంస్థలు కూడా వెలిశాయి. 1935లో రామదాసు పంతులు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు 'ఆంధ్ర స్వరాజ్య పార్టీ'ని స్థాపించారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ మార్క్స్ సిద్ధాంతంపై విశ్వాసంతో 1934, జూన్‌లో విజయవాడలో ఆంధ్ర సోషలిస్టు పార్టీ ఏర్పడింది. ఇందులో– పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, క్రొవ్విడి లింగరాజు, అల్లూరి సత్యనారాయణ రాజు సభ్యులు. 1934లో తెన్నేటి విశ్వనాథం అధ్యక్షతన ఆంధ్ర సోషలిస్టు పార్టీ ఏర్పడింది. 1940లో ఎం.ఎన్.రాయ్ 'రాడికల్ డెమోక్రటిక్ పార్టీ'ని స్థాపించారు. ఇందులో అబ్బూరి రామకృష్ణారావు, త్రిపురనేని గోపీచంద్, ఆవుల గోపాల కృష్ణమూర్తి, ఎం.వి.శాస్త్రి సభ్యులు. దీని ప్రథమ మహాసభ తెనాలిలో జరిగింది.

1940, అక్టోబర్ 17న వ్యక్తి సత్యాగ్రహం ప్రారంభమైంది. మొదటి సత్యాగ్రాహిగా ఆచార్య వినోబాభావే పాల్గొని అరెస్టయ్యారు. 1942, జూలై 29న ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘం మచిలీపట్నంలో సమావేశమైంది. నాటి కాంగ్రెస్ అధ్యక్షుడిగా పట్టాభి సీతారామయ్య, కార్యదర్శిగా కళా వెంకటరావు క్రియాశీలకంగా పని చేశారు. భారత్ నుంచి బ్రిటిష్ వారు వైదొలగడానికి కావాల్సిన ఉద్యమం కోసం ఒక రహస్య సర్క్యులర్‌ను మచిలీపట్నం సమావేశం రూపొందించింది. చాలా రోజుల తర్వాత ఈ సర్క్యులర్ కర్నూల్‌లో కాంగ్రెస్ ఆఫీసును శోధించినపుడు లభ్యమవడంతో దీన్ని కర్నూల్ సర్క్యులర్ లేదా ఆంధ్రా సర్క్యులర్ అంటారు. క్విట్ ఇండియా ఉద్యమానికి సంబంధించి ఆంధ్రలో సమావేశం 1942, ఆగస్టు 11న తెనాలిలో జరిగింది.

ఈ విధంగా స్వాతంత్ర్య సమరంలో భారతజాతితో పాటు ఆంధ్రులు తమదైన చైతన్యవంతమైన పాత్ర పోషించడం అభినందనీయం.

## నమూనా ప్రశ్నలు

1) **క్రిసెంట్ పత్రిక స్థాపకులు?**
ఎ) గాజుల లక్ష్మీనరసు శెట్టి బి) అనీబిసెంట్
సి) గాంధీ
డి) గాడిచర్ల హరిసర్వోత్తమరావు
**సమాధానం : సి**

2) **మద్రాసు మహాజనసభ ఏర్పడిన సంవత్సరం?**
ఎ) 1885 బి) 1886 సి) 1884 డి) 1910
**సమాధానం : సి**

3) **చెన్నపట్టణం స్వదేశీ సంఘానికి గల మరోపేరు?**
ఎ) మద్రాసు మహాజనసభ బి) మద్రాసు స్థానికుల సభ
సి) జాతీయ కాంగ్రెస్ డి) మద్రాసు బీచి సమావేశం
**సమాధానం : బి**

4) **ఆంధ్రప్రకాశిక అనే రాజకీయ వారపత్రికను పార్థసారథినాయుడు ఎప్పుడు స్థాపించారు?**
ఎ) 1884 బి) 1887 సి) 1898 డి) 1885
**సమాధానం : డి**

5) **కింది వారిలో 1885 నాటి భారత జాతీయ కాంగ్రెస్ సమావేశానికి రాజమండ్రి నుంచి హాజరైనవారు?**
ఎ) న్యాపతి సుబ్బారావు బి) వెంకట సుబ్బారాయుడు
సి) కందుకూరి డి) కేశవ పిళ్లై
**సమాధానం : ఎ**

6) **జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి ఆంధ్రుడు?**
ఎ) పి.రంగయ్య నాయుడు బి) కేశవ పిళ్లై
సి) పి.ఆనందాచార్యులు డి) న్యాపతి సుబ్బారావు
**సమాధానం : సి**

7) **జాతీయ కాంగ్రెస్‌కు అనుబంధంగా జిల్లా కాంగ్రెస్ కమిటీలు తొలుత ఎక్కడ ప్రారంభమయ్యాయి?**
ఎ) మరాఠా ప్రాంతంలో బి) బెంగాల్‌లో
సి) ఆంధ్రలో డి) కాశ్మీర దేశంలో
**సమాధానం : సి**

8) **భారతదేశంలోనే తొలి జిల్లా కాంగ్రెస్ సంఘం ఏది?**
ఎ) కృష్ణా జిల్లా కాంగ్రెస్ సంఘం
బి) తిరువాన్కూరు జిల్లా కాంగ్రెస్ సంఘం
సి) శ్రీకాకుళం కాంగ్రెస్ సంఘం
డి) డార్జిలింగ్ కాంగ్రెస్ సంఘం
**సమాధానం : ఎ**

SAKSHI

9) కృష్ణా జిల్లా కాంగ్రెస్ సంఘ మూడో సమావేశం ఎక్కడ జరిగింది?

ఎ) మచిలీపట్నం బి) గుంటూరు

సి) ఏలూరు డి) కాకినాడ

**సమాధానం : సి**

10) 1906 నాటి కలకత్తా కాంగ్రెస్ సమావేశానికి హాజరుకాని వారెవరు?

ఎ) కొమర్రాజు లక్ష్మణరావు బి) మునగాల రాజా

సి) ఆనందాచార్యులు డి) ఎవరూకాదు

**సమాధానం : డి**

11) 1906 కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో స్వదేశీ తీర్మానం ప్రవేశపెట్టినవారు?

ఎ) పి.ఆనందాచార్యులు బి) కొమర్రాజు

సి) గాడిచర్ల డి) మునగాల రాజా

**సమాధానం : ఎ**

12) మద్రాస్ బీచి సమావేశానికి అధ్యక్షులు?

ఎ) పి.ఆనందాచార్యులు బి) జి.సుబ్రహ్మణ్య అయ్యర్

సి) అయ్యదేవర కాళేశ్వరరావు డి) గొల్లపూడి సీతారామశాస్త్రి

**సమాధానం : బి**

13) బాలభారతి సమితి ఎక్కడ ఏర్పాటైంది?

ఎ) రాజమండ్రి బి) కాకినాడ

సి) ఏలూరు డి) విజయనగరం

**సమాధానం : ఎ**

14) బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలో పర్యటించినది ఎప్పుడు?

ఎ) 1908, సెప్టెంబర్ బి) 1907, ఏప్రిల్

సి) 1907, సెప్టెంబర్ డి) 1908, ఏప్రిల్

**సమాధానం : బి**

15) 'భరతఖండంబు చక్కని పాడియావు.....' జాతీయోద్యమ పద్యకవి?

ఎ) కందుకూరి బి) గురజాడ

సి) చిలకమర్తి డి) విశ్వనాథ

**సమాధానం : సి**

16) వందేమాతరం ఉద్యమం ఏ నాయకుణ్ణి ఆంధ్ర దేశానికి అందించింది?

ఎ) బిపిన్ చంద్రపాల్ బి) గాడిచర్ల హరిసర్వోత్తమరావు

సి) బాలగంగాధర్ తిలక్

డి) పనప్పాకం అనంతాచార్యులు

**సమాధానం : బి**

17) కాకినాడ దొమ్మీకేసు జరిగిన సంవత్సరం?

ఎ) 1907 బి) 1906 సి) 1908 డి) 1909

**సమాధానం : ఎ**

18) కోటప్ప కొండ సంఘటనలో బలైన వీరుడు?

ఎ) కోటప్పరెడ్డి బి) కొండారెడ్డి

సి) చిన్నపరెడ్డి డి) కెర్‌హస్ట్

**సమాధానం : సి**

19) 'హిందూ దేశ దారిద్ర్యం' గ్రంథకర్త?

ఎ) అత్తిలి సూర్యనారాయణ

బి) ముట్నూరి సుబ్బారాయుడు

సి) ముట్నూరి కృష్ణారావు

డి) కె.వెంకట రమణారావు

**సమాధానం : ఎ**

20) హోంరూల్ లీగ్ ఆంధ్రశాఖ కార్యదర్శి?

ఎ) అనీబిసెంట్ బి) కందుకూరి

సి) గాడిచర్ల హరిసర్వోత్తమరావు

డి) ముట్నూరి కృష్ణారావు

**సమాధానం : సి**

SAKSHI

# జాతీయోద్యమంలో... ఆంధ్ర కవులు

**ఆంగ్లేయుల వలస పాలనకు వ్యతిరేకంగా.. 1857లో మొదటి భారత స్వాతంత్ర్య పోరాటం జరిగింది. 1947, ఆగస్టు 15న బ్రిటిషర్ల పాలన నుంచి దేశానికి విముక్తి లభించింది. దాదాపు రెండు వందల ఏళ్ల పరాయి పాలనలో మగ్గిన భారత్.. తిరిగి స్వేచ్ఛా వాయువులను పీల్చుకుంది. దేశంలో పలు ప్రజా, సాహిత్య ఉద్యమాల కృషి ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించింది! స్వాతంత్ర్యోద్యమ సంగ్రామంలో స్ఫూర్తిని రగిల్చిన కవుల గురించి గ్రూప్-2 పరీక్షల్లో తరచూ రచయితల ప్రారంభ వాక్యాలను ఇచ్చి, గేయాన్ని ఎవరు రాసారు..? అని ప్రశ్నలు అడుగుతున్నారు. కొన్ని ముఖ్యమైన గేయాలను ఈ వ్యాసంలో పొందుపరిచాం. ఇవి అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తం!!**

స్వాతంత్ర్యోద్యమ కాలంలో.. కవులు, రచయితలు విశేషంగా స్పందించారు. ఆ కాలంలో ఆంధ్రదేశంలో గొప్ప సాహిత్యం వెల్లివిరిసింది. ప్రబోధ గేయాలు, పద్యాలు, పాటలు, వీరరస ప్రధాన స్ఫూర్తి గేయాలు పుట్టుకొచ్చాయి. వీరోచిత గేయాలు, బుర్ర కథలు... ప్రజలలో గొప్ప చైతన్యం తీసుకొచ్చాయి. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమ కాలంలో... జెండాపాటలు, రాట్నం పాటలు, మద్యపాన నిరసన గీతాలు, దేశభక్తి గీతాల ద్వారా... తెలుగు రచయితలు, ప్రజలలో చైతన్యం కలిగించారు. ఆంధ్రులలో జాతీయోద్యమ స్ఫూర్తిని రగిల్చారు.

## జాతీయోద్యమ స్ఫూర్తితో:

ఉత్తర భారతదేశంలో ప్రేమ్‌చంద్.. బెంగాల్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్, శరత్‌చంద్ర ఛటర్జీ, నజ్రుల్ ఇస్లాం.. తమిళంలో సుబ్రమణ్య భారతి.. మలయాళంలో శంకర్ కురూప్.. సంస్కృతంలో గణపతిముని.. తెలుగులో గరిమెళ్ల సత్యన్నారాయణ, ఉన్నవ లక్ష్మీనారాయణ, విశ్వనాథ సత్యన్నారాయణ, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మంగిపూడి వెంకట శర్మ, రాయప్రోలు సుబ్బారావు, కరుణ శ్రీ, కాళోజీ నారాయణరావు, త్రిపురనేని రామస్వామి చౌదరీ, జాషువా, దాశరథీ కృష్ణమాచార్య, వడ్డాది సీతారామాంజనేయులు, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, వేములపల్లి శ్రీకృష్ణ, గురజాడ అప్పారావు, వేదుల సత్యన్నారాయణ... తదితరులెందరో జాతీయోద్యమ స్ఫూర్తితో గొప్ప సాహిత్యాన్ని సృష్టించి.. ఆంధ్రజాతిని మేల్కొల్పారు.

భావకవి చక్రవర్తిగా పేరు గాంచిన బసవరాజు అప్పారావు... భారత స్వాతంత్ర్యోద్యమం సమయంలో గాంధీపై రాసిన గేయం ఆ రోజుల్లో ఆబాలగోపాలాన్ని ఆకర్షించింది. 'మా గాంధీ' శీర్షికతో రాసిన ఈ గేయంలో...!

1. 'కొల్లాయి గట్టితే నేమి మా గాంధీ,
   కోమటై పుట్టితేనేమి?......అంటూ.. సాగిపోతుందీ గేయం. ఈ
   విధంగా గేయంలో మొదటి వాక్యాలనిచ్చి..
   ఈ గేయ రచయిత ఎవరు? అని ప్రశ్నిస్తారు.
2. అమరావతీ పట్టణమున బౌద్ధుల విశ్వ
   విద్యాలయములు స్థాపించునాడు,
   ఓరుగల్లున రాజవీర లాంఛనముగ,
   బలు శస్త్ర శాలలు నిలుపునాడు,
   విద్యానగర రాజ వీధుల గవితకు
   వెండి పందిళ్లు కప్పించునాడు,
   పొట్నూరికి సమీపమున నాంధ్ర సామ్రాజ్య
   దిగ్జయ స్తంభ మెత్తించునాడు!...
   అంటూ... సాగే ఈ గేయ రచయిత ఎవరు?

   జవాబు : రాయప్రోలు సుబ్బారావు
3. వేగి రాజుల సంవితతికి గరువంపు
   నడక నేర్పినది నన్నయ్య రచన
   తెనుగు భాషా పద్మమునకు జారని వన్నె
   బట్టించినది కవిబ్రహ్మ పలుకు
   కంచు ఢక్కల నోరు గట్టించి జయకేత
   నముల నెత్తినది శ్రీనాథు జిహ్వ
   ప్రతి లేని యవవర్గ పదవి వంకకు రహ....
   దారి దీసినది పోతన చరిత్ర......
   ఈ విధంగా సాగుతుందీ కవిత....
   దీన్ని ఎవరు రచించారు?

   జవాబు : జాషువా
4. గోదావరీ పావనో దారనా! పూర
   మఖిల భారతము మా దన్న నాడు,
   తుంగ భద్రా సముత్తుంగ రావము తోడ
   కవుల గానం శ్రుతి' గలయునాడు,
   పెన్నానదీ సముత్పన్న కైరవ దళ
   శ్రేణిలో తెన్గు వాసించునాడు
   కృష్ణాతరంగ నిర్ణిద్ర గానము తోడ
   శిల్పమ్ము తొలిపూజ సేయు నాడు......అంటూ
   'ఆంధ్ర పశసి' శీర్షికతో సాగే... ఈ గేయ రచయిత ఎవరు?

   జవాబు : విశ్వనాథ సత్యన్నారాయణ
5. 'మేలుకో సుచరిత్ర మేలుకో భరత పుత్ర
   మేలుకో చిరమిత్ర మేలుకో,
   కాలాయముగ మన పాలన వేళాయె-

SAKSHI

చాలు చాలు నిదుర మేలుకో

అనే గీతాన్ని ఎవరు రాసారు..?

జవాబు : మంగిపూడి వెంకటశర్మ

6. పరదేశీయులు తొలగండి

ఈ భారతదేశం మా దేశం

వినండి వినండి విశ్వ ప్రజలు

వీర భారత సందేశం...... అంటూ నినదించిన కవి ఎవరు?

జవాబు : వానమామలై వరదాచార్యులు

7. ''తెల్లవాడే వట్టి కల్ల వాడే

మన తల్లి దేశమంత కొల్లగొట్టి నాడే''..... అంటూ

బానిసత్వాన్ని నిరసించిన కవి ఎవరు?

జవాబు : మిక్కిలినేని భగవంతరావు

8. ''ఎంత చక్కని తల్లివే! రాణివే!

ఎల్ల భూములకు నీవు'' అంటూ... గానం చేసిన రచయిత ఎవరు?

జవాబు : కాటూరి వెంకటేశ్వరరావు

9. 'జయ జయ భారత జననీ, పావనీ

జయ జయ సకలానంద దాయిని

హిమాల యోన్నత సమాదర్శిని,

తమోదళన, విద్యా స్వరూపిణి....

అంటూ సాగుతుంది ఈ గేయం.. దీని రచయిత ఎవరు?

జవాబు : గురజాడ రాఘవశర్మ

10. రండు హైందవ శూరులార

కదలి రండోయ్ బాబు

రథము లాగండోయ్

స్వేచ్ఛ చవీ చిందులాడే పిచ్చి మానం

జోయ్..... అన్న గేయ రచయిత ఎవరు?

జవాబు : దామరాజు పుండరీకాక్షుడు

11. 'భరత ఖండంబు చక్కని పాడి యావు,

హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ

తెల్లవారను గడుసరి గొల్లవారు

పితుకుతున్నారు మూతులు బిగియగట్టి' అన్న పద్యాన్ని ఆశువుగా చెప్పింది ఎవరు?

జవాబు : చిలకమర్తి లక్ష్మీ నరసింహపంతులు

(1907లో బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి వచ్చిన సందర్భంలో)

12. 'దేశమును ప్రేమించు మన్నా

మంచి యన్నది పెంచుమన్నా',... అనే

అభ్యుదయ గీతాన్ని

గురజాడ అప్పారావు గారు ఏ సంవత్సరంలో రాసారు?

జవాబు : 1910లో

13. 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా

ఏ పీఠ మెక్కినా ఎవ్వరెదురైనా

పొగడరా నీ తల్లి భూమి భారతిని

నిలుపరా నీ జాతి నిండు గౌరవము'... అంటూ స్ఫూర్తినిచ్చిన ఈ గీత రచయిత ఎవరు? ఏ సంవత్సరంలో రాసారు?

జవాబు : రాయప్రోలు సుబ్బారావు. 1914లో

14. 'స్వరాజ్య గీతామృతం' అనే పుస్తక జంటకవులు ఎవరు? ఏ సంవత్సరంలో ప్రచురించారు?

జవాబు : బాలకవి వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీవిశ్వనాథశాస్త్రి, 1921లో ప్రచురించారు.

15. 'జయ జయ ప్రియ భారత,

జనయిత్రీ దివ్య ధాత్రి

జయ జయ శత సహస్ర

నర నారీ హృదయ నేత్రీ' అనే జాతీయ గీత రచయిత ఎవరు?

జవాబు : దేవులపల్లి కృష్ణశాస్త్రి

16. 'వీర గంధము దెచ్చినారము

వీరు డెవ్వడో దెల్పుడీ

పూసిపోదుము, మెడను వైతుము

పూలదండలు భక్తితో'...... దేశభక్తులకు సవాలు విసిరిన ఈ కవి ఎవరు?

జవాబు : త్రిపురనేని రామస్వామి చౌదరి

17. ''ఉప్పు కొనండయ్యా, స్వరాజ్యపు

ఉప్పు కొనండయ్యా'....

ఉప్పు చట్టమును ధిక్కరించితే

తప్పక మనకు స్వరాజ్యము వచ్చును''.. అనే ఉప్పు సత్యాగ్రహ గీతాన్ని ఎవరు రాసారు?

జవాబు : బసవరాజు అప్పారావు

18. 'మా కొద్దీ తెల్ల దొరతనము– దేవ

మా కొద్దీ తెల్ల దొరతనము–

మా ప్రాణాలపై పొంచి– మానాలు హరియించె'.....

సహాయ నిరాకరణ ఉద్యమ కాలంలో రాసిన ఈ గేయ రచయిత ఎవరు?

జవాబు : గరిమెళ్ల సత్యన్నారాయణ

19. 'చీరాల–పేరాల వనవాసం' అనే పద్యకావ్య రచయిత ఎవరు? ఏ సంవత్సరంలో వెలువడింది?

జవాబు : పిశుపాటి నారాయణశాస్త్రి, 1922లో

20. ఎంకినాయుడు బావల ప్రణయాన్ని వివరించే ఎంకి పాటల రచయిత?

జవాబు : నండూరి సుబ్బారావు

21. ఆధునిక కాల్పనిక కవిత్వం పేరిట– 'నువ్వు ఎక్కదలచుకొన్న రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు'

అంటూ.. 'త్వమేవాహం' రచయిత ఎవరు?

జవాబు : ఆరుద్ర

SAKSHI